
క్లుప్తంగా

ముగిసిన దశమి ఉత్సవాలు


విశేష అలంకరణలో నల్లారెడ్డి స్వామి

ఆస్పరి: మండలంలోని తంగరడోణలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్వాముల ఆలయాల్లో గంగ,ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి సమీపంలోనున్న నల్లారెడ్డి ఆలయం వద్ద ఉన్న రాక్షస పడవ వద్ద జంతులవును బలిదానం చేసి ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న, రాజు పాల్గొన్నారు.

వెల్దుర్తి ఎస్‌ఐగా జి.ఆశోక్



వెల్దుర్తి: మండల ఎస్‌ఐగా జి.అశోక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్ బదిలీపై కర్నూలు వెళ్లగా ఆయన స్థానంలో నంద్యాల జిల్లా, పాములపాడు మండల నుంచి అశోక్ ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

మద్దమ్మ కుంటకు నీటి విడుదల


కుంటలోకి నీరు ప్రవహిస్తున్న దృశ్యం

మద్దికెర : మద్దమ్మ కుంటలో నీరు సమృద్ధిగా ఉంటే గ్రామంలో భూగర్భజలాలు పెరుగుతాయని సర్పంచ్ సుహాసిని, ఈఓ శివకుమార్ అన్నారు. హంద్రీనీవా కాలువకు నీరు రావడంతో శుక్రవారం స్థానిక కాలువ నుంచి గ్రామంలోని మద్దమ్మకుంటకు నీటి పంపింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుంట గ్రామానికి పైభాగాన ఉన్నందున గ్రామంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య తగ్గుతుందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మినీట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని వాటి వద్ద వున్న బోర్లు బాగా పనిచేయడం వల్ల దాదాపు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆంజనేయులు, సిబ్బంది విజయ్ ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


అవార్డు గ్రహీతలకు సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించి ఉత్తమ అధికారులుగా మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఈఓఆర్డీ నరసింహులు, నరసాపురం పంచాయతీ కార్యదర్శి రహమత్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


హ్యాండ్‌బాల్ జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేసిన భూపతిరావు

కర్నూలు (టౌన్): కదిరి పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో.. రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలను అవకాశంగా మలుచుకొని ప్రతిభ చాటాలన్నారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

స్కౌట్స్ విద్యార్థులకు అభినందన

కోసిగి: జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో.. కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు మల్లికార్జున రెడ్డి, బాబు, అర్షియా, అఖిల్, గోవిందమ్మ కవాతు నిర్వహించి ప్రశంసలందుకున్నట్లు ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాలలో వారిని మెడల్స్‌తో అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కోసిగి మోడల్ స్కూల్ నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ పోగ్రామ్ కింద 26 మంది కవాతు నిర్వహించినట్లు తెలిపారు. శిక్షకులు రాజేశ్వరి పాల్గొన్నారు.

నారుకు టాటా.. నర్సరీ బాట!

- గతంలో సొంతంగా నారు పోసుకున్న రైతులు
- నేడు నర్సరీల నుంచి మొక్కల కొనుగోలు
- ఒక్కో మొక్క రూ.1 నుంచి రూ.4 వరకు విక్రయం
- నర్సరీల మొక్కలు నాణ్యంగా ఉంటాయంటున్న అధికారులు


ఆలూరులో షెడ్ నెట్‌లో పెంచుతున్న నారు, మొక్కలు

ఆలూరు రూరల్: ఒకప్పుడు రైతులు కూరగాయలు, ఆకు కూరల పంటల సాగుకు నారు, విత్తనాలు సొంతంగా సమకూర్చుకునేవారు. నారు కోసం తమ పొలంలో కొంత భూమి కేటాయించి నారు పోసుకునేవారు. అలాగే దిగుబడిలో నాణ్యమైన ధాన్యాన్ని విత్తనాలుగా ఉపయోగించేవారు. ఇందుకు వారు అధికంగా శ్రమించాల్సి వచ్చేది. తమ వద్ద విత్తనాలు, నారు లేకపోతే పక్కనున్న రైతుల నుంచి తీసుకుని పంటలు సాగు చేసేవారు. అయితే.. క్రమేణా కాలం మారడంతో.. రైతులు కూడా నూతన పద్ధతులు అవలంభిస్తున్నారు. ప్రస్తుతం నారు కోసం గతంలో లాగా ఇబ్బందులు పడటం లేదు. ప్రైవేటు నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. దీని వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్, రబీలో 12వేల హెక్టార్లల్లో ఆకు కూరలు, కూరగాయల పంటలు సాగవుతాయి. అయితే ఈ ఏడాది తీవ్ర వర్షాభావ ప్రభావం, తుంగభద్ర ప్రాజెక్టు పరిస్థితి కారణంగా.. హాలహర్వి, హొళగుంద మండలాల్లో తోటల సాగు తగ్గే అవకాశముందని హార్టికల్చర్ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం మీద ఈ ఏడాది 11వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఆస్పరి మండలంలో కూరగాయల పంటలు అధికంగా సాగవుతుండగా, చిప్పగిరి, ఆలూరు మండలాల్లో మిరప అధికంగా, దేవనకొండ మండలంలో ఉల్లి ఎక్కువగా పండిస్తారు.

రెడీమేడ్ మొక్కల వైపే మొగ్గు..

ఒకప్పుడు మిరప, టమాట పంటలు సాగు చేయాలంటే రైతులు ముందస్తు ఏర్పాట్లు చేసుకునేవారు. రైతు పొలంలోనే వారికి కావాల్సిన నారు కోసం కొంత విస్తీర్ణంలో భూమిని చదును చేసి విత్తనాలు చల్లేవారు.అవి మొలకలయ్యాక వాటిని పొలాల్లో నాటేవారు. ఈ పనుల కోసం దాదాపు నెలకు పైగా సమయం పట్టేది. మిరప, టమాట సాగు విస్తీర్ణం పెరగడం, తక్కువ సమయంలో పంట దిగుబడుల రావాలని రైతులు ఆరాటపడుతున్నారు. ఏడాదికి మూడు పంటలు సాగు చేసేలా రైతాంగం ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. దీంతో టమాట, మిరప వంటి నారుమళ్లకు ప్రత్యామ్నాయంగా రెడిమేడ్‌గా మొక్కలు సరఫరా చేసే నర్సరీలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఆశ్రయించి మొక్కలు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు.

మిరప,టమాట సాగు ఎక్కువ..

ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్వి, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ,ఆలూరు,హొళగుంద మండలాల్లో మిరప, టమాటతో పాటు కూరగాయల సాగు అధికంగా ఉంది. ఇందు కోసం రైతులు నర్సరీల్లో షెడ్ నెట్‌లో తయారు చేసిన నారు, మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రైతులు తమ విత్తనాలు ఇచ్చి నారు తయారు చేయించుకుంటున్నారు. నియోజకవర్గంలో 40కి పైగా నర్సరీలు రైతులకు నారు సరఫరా చేస్తున్నాయి.

పాత పద్ధతికి స్వస్తి..

గతంలో నారు తయారు చేసే నర్సరీలు లేవు. రైతులు తమ పొలాల్లో నారుమళ్లు సిద్ధం చేసి 30 రోజులలో నారు రాగానే పరస్పరం సహకరించుకుంటూ పంటలు సాగు చేసేవారు. ప్రస్తుతం నారుమడులకు స్వస్తి పలికారు. అధిక శాతం నర్సరీల నుంచే మొక్కలు కొనుగోలు చేస్తున్నారు. నర్సరీలలో పెంచే నారు మొక్కలు ఒకే ఎత్తులో ఉంటాయి. ప్రమాణాలకు అనుగుణంగా ఎంత మేర సూర్యరశ్మి, నీరు అందాలో అంతే మోతాదులో అందించి పెంచడం వల్ల ఇవి నాణ్యత కలిగి ఉంటాయి.

మొక్కని బట్టి ధర..

ఆలూరు ప్రాంతంలో మిరప, టమాట ఇతర కూరగాయలు ఎక్కువగా సాగు చేస్తారు. కొందరు రైతులు ఎకరాకు 15వేల మొక్కల కోసం విత్తనాలను కొని నర్సరీల యజమానులకు ఇచ్చి నారు పెంచుకుంటున్నారు. ఇందు కోసం మొక్కకు రూ.1.50 నుంచి రెండు రూపాయలు చెల్లిస్తున్నారు. 40 రోజు ల తర్వాత మొక్కలను తీసుకుని పొలంలో నాటుకుంటారు. మరి కొందరు రైతులు మొక్కకు రూ.3 నుంచి రూ.4 చెల్లించి నర్సీల యజమానుల వద్ద కొంటున్నారు.

సమయం ఆదా అవుతుంది



ఈ ఏడాది ఖరీఫ్‌లో 2 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. మిరప నారు కోసం విత్తనాలు కొని నర్సరీ నిర్వాహకులకు అందజేశా. ఎకరాకు 15 వేల మొక్కలను రూ.1.50 చొప్పున తీసుకుని నారు పెంచి ఇచ్చారు. గతంలో నా పొలంలోనే మిరప, టమాట నారు పెంచేవాళ్లం. పంట సాగుకు విస్తీర్ణం తక్కువ వస్తుండడంతో నర్సరీల యజమానులకు విత్తనాలు ఇచ్చి నారు పెంచుకుని తీసుకుంటున్నా. దీంతో నాకు సమయం, పొలం ఆదా అవుతోంది.

– వీరభద్ర, రైతు,గోనేహాల్,ఆలూరు మండలం

గుర్తింపు ఉన్న నర్సరీల నుంచే కొనుగోలు చేయాలి



వివిధ రకాల కూరగాయల సాగు చేసే రైతులు నారు కొనేటప్పుడు వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన నర్సరీల నుంచి మాత్రమే మొక్కలు కొనుగోలు చేయాలి. రైతు నారు కోసం అందించే విత్తనాలు సర్టిఫైడ్ కంపెనీ నుంచి కొనుగోలు చేయాలి. షెడ్ నెట్ నుంచి తీసుకున్న నారు శాస్త్రీయ పద్ధతుల్లో పెంచడం వల్ల నాణ్యతగా ఉంటాయి. అలాగే రైతుకు సమయం ఆదా అవుతుంది. పొలంలో పెంచినప్పుడు నారు, నీరు ఎక్కువ, తక్కువ కావడం, అధిక లేదా తక్కువ ఉష్ణోగ్రతలతో మొక్కలు హెచ్చుతగ్గుగా పెరుగుతాయి. నారు మధ్యలో కలుపు మొక్కల సమస్య ఉంటుంది. షెడ్ నెట్‌లో అలాంటివి ఉండవు.

– ఇందిర, ఉద్యానవన శాఖ అధికారిణి, ఆలూరు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


పూజలు నిర్వహిస్తున్న మహిళలు


సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

మద్దికెర : మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అర్చకులు వరలక్ష్మీ వ్రత మహత్యం గురించి భక్తులకు తెలియజేశారు.

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేకంగా వరలక్ష్మీ ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రూపామోహన్ శర్మ ఆలయంలో అమ్మవారికి 108 బిందెలతో గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు శ్రీరాం నగర్ క్యాంపు, హొన్నూరు క్యాంప్, ఆయా గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల్లో పూజారులు గంగపూజ, అభిషేకాలు, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. అనంతరం నైవేద్యం సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో గాయత్రీ మాత


వరలక్ష్మీ పూజలు చేసిన దృశ్యం

నదిలో దూకిన మహిళ

మంత్రాలయం: ఏ కష్టమొచ్చిందో తెలియదు గానీ ఓ మహిళ తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయింది. వివరాలివి.. ఆస్పరి మండలం అలసందగుత్తి గ్రామానికి చెందిన తిక్కలక్ష్మి (45) శుక్రవారం మంత్రాలయం వచ్చింది. సాయంత్రం పాతూరు వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా తుంగభద్ర నది వద్దకు వెళ్లి ఉన్నపాటున దూకేసింది. ఆ పక్కనే ఆడుకుంటున్న చిన్నారులు కేకలు వేయడంతో గ్రామస్తులు పరుగున వచ్చి ఆమెను ఒడ్డుకు చేర్చారు. కానిస్టేబుల్ రంగస్వామికి సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని ప్రైవేటు కారులో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. బాధితురాలి ఊపిరితిత్తుల్లోకి నీరు చేరినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. తిక్కలక్ష్మికి వివాహం కాలేదని, బంధువులకు సమాచారం అందించినట్లు కానిస్టేబుల్ తెలిపారు.

పాము కాటుతో కూలీ మృతి

తుగ్గలి : పాము కాటుతో మరో కూలీ మృతి చెందారు. పెండేకల్లు గ్రామానికి చెందిన శివమణి (21) పాత మట్టిమిద్దె ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈనెల 8న రాత్రి పాము కాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తుగ్గలి ఎస్‌ఐ జమీర్ తెలిపారు.

పకడ్బందీగా పంట నమోదు


చెరుకులపాడు పొలాల్లో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అక్తర్‌బాషా


వెల్దుర్తిలోని విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

వెల్దుర్తి: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి రైతు పంటను పకడ్బందీగా నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి అక్తర్‌బాషా తెలిపారు. శుక్రవారం చెరుకులపాడు, వెల్దుర్తి గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు సంబంధిత ధ్రువ పత్రాలతో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వెల్దుర్తిలోని వెంటకరమణ ట్రేడర్స్, అశ్రీతి క్రాప్ కేర్ సెంటర్ దుకాణాలను పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ ఏఓతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో లైసెన్స్, ధరల పట్టిక, స్టాక్ బోర్డు, అనుమతి పత్రాలతోపాటు గోడౌన్‌లో పురుగు మందు నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీ ప్రకారమే రైతులకు విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు.

మరమ్మతులూ కరువాయే!


రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి తెగిపోయిన చిప్పగిరి - దౌల్తాపురం రోడ్డు

చిప్పగిరి: మండల కేంద్రం చిప్పగిరి నుంచి దౌల్తాపురం,నంచర్ల మీదుగా రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా ప్రభుత్వం బిలుల్లు మంజూరు చేయక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రోడ్డు మార్గంలో ఉన్న వంకలపై తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేసి నామ మాత్రంగా మట్టి వేశారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అయితే రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు ఉన్నందున పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేరా అంటూ నంచర్ల, దౌల్తాపురం గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ


రైతులకు మొక్కలు అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: నీటి సౌకర్యం ఉన్న రైతులను ఉద్యాన పంటలవైపు నడిపించేందుకు ఉచితంగా పండ్ల మొక్కలు అందిస్తున్నామని సే ట్రీస్ సంస్థ ఆగ్రో ఫారెస్ట్రీ ఇండియా రూరల్ ప్రోగ్రామ్ హెడ్ మహీధర్ రెడ్డి తెలిపారు. మండలంలోని చుంచుఎర్రగుడి గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం ఉన్న రైతులకు ఉచితంగా 20 వేల మొక్కలు శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..రైతులు ఐదంతస్తుల పండ్ల తోటల పెంపకం ద్వారా అధిక లాభాలు అర్జించవచ్చన్నారు. మానవ జీవన విధానం మొక్కలతో ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పండ్ల తోటల సాగు ద్వారా జీవనోపాధులు పెరిగి రైతులు ఆర్థికంగా ఋలపడటానికి దోహదపడుతుతాయన్నారు. గ్రామంలోని 42 మంది రైతులకు 104 ఎకరాల్లో సాగు చేసేందుకు చీని, మామిడి, సీతాఫలం, అంజూర, ఎర్రచందనం, కొబ్బరి తదితర 20,040 మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ బండమీది నారాయణ, క్లస్టర్ కో–ఆర్డినేటర్ ఎల్లప్ప, మండల హార్టికల్చర్ అధికారి నరేష్‌రెడ్డి, సునీల్, గ్రామస్తులు ప్రకాష్‌గౌడ్, చిన్న మద్దిలేటి, పుల్లయ్య, నాగేష్, వెంకటేష్, సిబ్బంది కత్తి మద్దయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలు

దేవనకొండ: అనివార్య కారణాల వల్ల మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన జరగాల్సిన ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇందులో మాదాపురం, పాలకుర్తి పాఠశాలలు ఉండగా, వీటిలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.తిమ్మారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

కృష్ణగిరి: ఈ నెల 8న పాఠశాలల్లో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడిన నాలుగు పాఠశాలల్లో శనివారం మరోమారు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సునంధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 46 పాఠశాలలకు గాను 42 పాఠశాలల్లో ఎన్నిక ఏకగ్రీవం కాగా మిగిలిన.. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు, లక్కసాగరం, పందిర్లపల్లె, తెగదొడ్డి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నిక జరగాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించే ఈ ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులందరూ హాజరకావాలని కోరారు.

దుకాణాల వేలాలు నిర్వహించాలి



దుకాణాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆలూరు రూరల్: స్థానిక సంత మార్కెట్‌లో రూ.1.20 కోట్ల రూర్బన్ నిధులతో నిర్మించిన 27 పంచాయతీ దుకాణాలకు బహిరంగ వేలాలు నిర్వహించాలని సీపీఐ మండల కార్యదర్శి షాకీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ దుకాణాల ముందు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ పంచాయతీ అధికారులు రాజకీయ నాయకుల మాటలకు తలొగ్గి దుకాణాలు వేలం వేయడం లేదని మండిపడ్డారు. దుకాణాలు నిర్మించి నాలుగేళ్లు పూర్తవుతున్నా వినియోగంలోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. కృష్ణ, ఈరన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలపై రైతులకు అవగాహన కల్పించండి


సిబ్బందితో సమావేశమైన ఏడీఏ విక్టర్‌బాబు

ఆలూరు: మినీ గోకులాలను నిర్మించుకునేలా పాడి రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ సీ.విక్టర్‌బాబు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. పూర్తి చిరునామాతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, పశువుల సంఖ్యను గ్రామ రెవెన్యూ అధికారితో ధ్రువీకరిస్తూ జారీ చేసిన పత్రాన్ని దరఖాస్తుకు జత చేసి గ్రామ ఆర్‌బీకేల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లకు అందజేయాలని చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుతోపాటు అనంతపురం జిల్లా నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మొలగవల్లి ప్రజలతో మాట్లాడుతున్న ఆలూరు సీఐ శ్రీనివాసులు నాయక్

ఆలూరు రూరల్: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో ఎస్‌ఐ నరసింహులుతో కలిసి పర్యటించి విపత్తులు, నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. అక్రమ మద్యం, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు చెప్పవద్దన్నారు. వర్షకాలం నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ పరికరాల నుంచి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మహిళలు,యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మోస్తరు వర్షం


ఉధృతంగా ప్రవహిస్తున్న హాలహర్వి-నిట్రవట్టి గ్రామాల మధ్యనున్న వంక


జలమయమైన హాలహర్వి-గూళ్యం రహదారి


ఏరూరులో పారుతున్న వర్షపు నీరు

హాలహర్వి: మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. వర్షం నీటితో ఊరువంక పొంగి పొర్లుతోంది. మండల కేంద్రమైన హాలహర్వి–గూళ్యం రహదారిలోనున్న వంక ఉధృతంగా ప్రవహించడంతో అరగంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. హాలహర్వి–నిట్రవట్టి గ్రామాల మధ్య కూడా వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. వర్షం వచ్చిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఎత్తైన వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

చిప్పగిరి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఏరూరు, బంటనహాలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఏరూరు సమీప పొలాల్లో వర్షపు నీరు భారీగా ప్రవహించింది. అలాగే గ్రామంలోని వీధులు జలమయమయ్యాయి. కాగా.. పొలాల్లోని వర్షపు నీరు గ్రామంలోకి వస్తుండటంతో వీధుల్లో వర్షపునీరు పొంగిపొర్లుతోంది. పొలాల నీరు గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మద్దికెర : మొక్కలు నాటి వదలేయకుండా వాటిని సంరక్షించుకోవాలని సర్పంచ్ విజయుడు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ పులిశేఖర్, ప్రధానోపాధ్యాయుడు ఫరూక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులకు చెట్ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుగ్గలి : ఈనెల 18వ తేదీన పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అట్ల దివాకర్ రెడ్డి, రాజేష్ శుక్రవారం తెలిపారు. 2007–08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో మోటారు మరమ్మతులకు గురికావడంతో వారం రోజులుగా గ్రామంలో పలు కాలనీల్లో నీటి ఎద్దడి నెలకొంది. సమస్యపై స్పందించిన సర్పంచ్ భీమ, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర శుక్రవారం మోటారుకు మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు.